

పేదలకు టన్ను బియ్యం పంపిణీ



పేదలకు బియ్యం పంపిణీ చేస్తున్న దాతలు

పీలేరు: పేదలకు టన్ను బియ్యం పంపిణీ చేసిన దాత ఉదార స్వభావాన్ని పీలేరు మాజీ ఎమ్మెల్యే జివి శ్రీనాథరెడ్డి ప్రశంసించారు. శనివారం స్థానిక చిత్తూరు రోడ్డులోని ఇందిరమ్మ కాలనీలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీలేరుకు చెందిన మనోరెడ్డి తన తల్లిదండ్రులైన విశ్రాంత ప్రధానోపాధ్యాయులు నారాయణరెడ్డి, హెలెన్ కుమారీల జ్ఞాపకార్థం పేదలకు ఒక్కొక్కరికి ఐదు కిలోల వంతున బియ్యం పంపిణీ చేశారు. మనోరెడ్డి, అతని సోదరుడు వినోద్ ఈ బృహత్తర కార్యక్రమాన్ని గత 15 ఏళ్లుగా చేస్తుండడం విశేషమన్నారు. ఇదే స్ఫూర్తితో దాతలు ఉదారంగా దాన, ధర్మ కార్యక్రమాలను చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో కాకులారంపల్లి పంచాయతీ సర్పంచ్ హరినీ సురేష్‌రెడ్డి, కృష్ణారెడ్డి, దావూద్, సహదేవ రెడ్డి, మురాషావల్లి పాల్గొన్నారు.

కెపి ఉల్లికి శాశ్వత కొనుగోలు కేంద్రం

హుళక్కేనా!



ఏటా అమ్మకాలకు కష్టాలే..

రెండేళ్లుగా కొనుగోళ్లు చేయని మార్క్‌ఫెడ్

రైతులను దోపిడీ చేస్తున్న ప్రయివేటు వ్యాపారులు

35 ఏళ్లుగా ఉద్యమబాటలో రైతులు

ఉల్లి పేరు వినగానే మార్కెట్లో ఎవరి నోట విన్నా ఘాటు వినిపిస్తుంది. కెపి ఉల్లి సాగు చేసిన రైతు పరిస్థితి మాత్రం అందుకు భిన్నంగా ఉంది. ఉల్లి ధరలు మార్కెట్లో పర్వాలేదు అనుకుంటే పండించిన పంటను అమ్మకం చేసేందుకు నానా అవస్థలు పడాల్సి వస్తున్నది. కెపి ఉల్లి సాగు, రైతుల పరిస్థితి, ప్రభుత్వ కొనుగోళ్లు, అనుమతులపై ప్రజాశక్తి ప్రత్యేక కథనం...



పొలంలో రాశులుగా పోసిన ఉల్లి (ఫైల్‌ఫొటో)

ప్రజాశక్తి - చాపాడు

కెపి ఉల్లి రైతులకు ప్రతి సంవత్సరం కష్టాలు తప్పడంలేదు. కేంద్ర ప్రభుత్వం చూపుతున్న నిర్లక్ష్య వైఖరికి కెపి ఉల్లి రైతు కంట కన్నీరుబుకుతోంది. ఉల్లిని కోస్తే కన్నీళ్లు కారటం సహజం. అయితే కెపి ఉల్లిని పండిస్తేనే కన్నీళ్లొస్తున్నాయని రైతులు వాపోతున్నారు. కెపి ఉల్లి అని పిలిచే క్రిష్ణాపురం ఉల్లి అరుదైన రకం. ఎగుమతులకే ఉద్దేశించిన రకమిది. 75 సంవత్సరాలకుపైగా చరిత్ర కలిగిన ఈ పంటను పండించే రైతులంటే కేంద్ర ప్రభుత్వం మాత్రం చిన్నచూపుచూస్తోంది. రైతులు పండించిన ఉల్లిని మార్క్‌ఫెడ్ కొనుగోలు చేసి ప్రయివేటు ఏజన్సీల ద్వారా విదేశాలకు ఎగుమతి చేయాల్సి ఉంది. ప్రధానంగా కెపి ఉల్లిని శ్రీలంక, సింగపూర్, మలేషియా, ఇండోనేషియా, బ్రూనై, పోర్ట్‌కెలాంగ్ తదితర దేశాలకు ఎగుమతి చేస్తుంటారు. ప్రభుత్వ అలసత్వం వల్ల ఏటా కెపి ఉల్లి రైతులు నష్టపోతూనే ఉన్నారు. మార్క్‌ఫెడ్ కొనుగోలు చేయకపోవడంతో ప్రయివేటు వ్యాపారులు రంగప్రవేశం చేసి రైతులను దోపిడీకి గురిచేస్తున్నారు. కెపి ఉల్లి రైతులు అన్యాయానికి గురికాకుండా ఉండాలంటే మైదుకూరులో శాశ్వత కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఇక్కడ ప్రభుత్వ రంగ సంస్థ అయిన మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రం ఏర్పాటుకు 35 ఏళ్లుగా రైతులు ఉద్యమబాట పట్టారు. ప్రభుత్వంలో చలనంలేదు. రైతులు ఆందోళనలు చేసుకోవాల్సిందే తప్ప కొనుగోలు కేంద్రంను తెప్పించడంలో ప్రజాప్రతినిధులు కూడా విఫలమయ్యారు. ఎన్నికల సమయంలో నాయకులు మాత్రం హామీలు గుప్పిస్తుంటారు. ఆ తర్వాత మాట మరుస్తుంటారు.

ఎగుమతులపై కేంద్రం నిషేధం

ఉల్లి ధరలు పెరిగిన సందర్బాలలో అన్ని రకాల ఉల్లిపాయల ఎగుమతులు నిషేదం విధిస్తూ కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులను జారీ చేస్తున్నది. రైతుల నుంచి అభ్యర్థనలు వచ్చిన తరువాత ఎగుమతులపై నిషేధం తొలగిస్తున్నారు. అన్ని రకాల ఉల్లిపై ఆంక్షలు కొనసాగనున్నాయని ప్రకటించిన సందర్భంలో స్థానికంగా అమ్మకం కాని విదేశీ రకం కెపి ఉల్లి పండించే రైతుల్లో ఆందోళన మొదలవుతున్నది. దేశవ్యాప్తంగా ఉల్లి ధరలు రెక్కలు వచ్చినవేళ కేంద్రం దిద్దుబాటు చర్యల్లో భాగంగా ఈ నిర్ణయం తీసుకుంటుంది. దేశీయ మార్కెట్లో ఉల్లి లభ్యత పెంచడం ఉల్లి ధరను నియంత్రించే లక్ష్యంగా ఈ నిషేధం విధిస్తున్నారు. డిజిఎఫ్‌టి డైరెక్టర్ జనరల్ (ట్రేడ్) నోటిఫికేషన్ విడుదల చేసిన ప్రతి సారి రైతుల్లో ఆందోళన చెందుతున్నారు. ఉల్లి పండించిన రైతులు పంటను అమ్ముకునేందుకు మాత్రం నానా కష్టాలు పడాల్సి వస్తుంది. ఈ సమస్య తొలగాలంటే కెపి ఉల్లి ఎగుమతులపై శాశ్వతంగా నిషేధం ఎత్తివేయాలి.

దోపిడీకి గురవుతున్న రైతులు

ప్రతి సంవత్సరం కెపి ఉల్లి రైతులు ప్రయివేటు వ్యాపారుల దోపిడీకి గురవుతున్నారు. ఉల్లిని మార్క్‌ఫెడ్ కొనుగోలు చేసి విదేశాలకు ఎగుమతి చేయాల్సి ఉంది. గిట్టుబాటు ధర కోసం రైతులు ఆందోళనకు దిగినప్పుడు మాత్రం మార్క్‌ఫెడ్ రంగంలోకి దిగి కొనుగోళ్లు చేస్తుంది. ఆ తర్వాత అడ్రస్‌లేకుండా పోతుంది. రెండు సంవత్సరాలుగా మార్క్‌ఫెడ్ ఉల్లిని కొనుగోలు చేయడంలేదు. రైతులు తీవ్రంగా నష్టపోయారు. ప్రయివేటు వ్యాపారులు తమకు అవసరమైన మేరకు మాత్రమే ఉల్లిని కొనుగోలు చేస్తారు. రెండవ రకాన్ని కొనుగోలు చేయరు. బయట ఈ ఉల్లిని అమ్ముకునేందుకు రైతులకు వీలుకాదు. మార్క్‌ఫెడ్ అయితే రైతుల నుంచి ప్రతి గడ్డను కొనుగోలు చేస్తుంది. అప్పుడు రైతులు కొంత మేరకు లాభపడేందుకు వీలుంటుంది. మార్క్‌ఫెడ్ కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేస్తే రైతులకు మంచి గిట్టుబాటు ధర కూడా లభించే అవకాశం ఉంది. ఉల్లినే వ్యాపారంగా మార్చుకున్న కొందరు వ్యాపారులు ఎలాగైనా ఎక్కువ ధర చెల్లించి ఉల్లిని కొనుగోలు చేసేందుకు వీలుంటుంది.

తగ్గుతున్న ఉల్లి విస్తీర్ణం

ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా ఏడాదికేడాది కెపి ఉల్లి సాగు గణనీయంగా తగ్గుతూ వస్తోంది. ప్రతి సంవత్సర



15 వేల ఎకరాల్లో సాగయ్యే ఉల్లి ఇప్పుడు ఐదు వేల ఎకరాలకు పడిపోయింది. ప్రభుత్వం నుంచి ప్రోత్సాహం లేకనే ఈ పంట సాగు పడిపోయింది. కడప జిల్లాలోని మైదుకూరు, దువ్వూరు, ఖాజీపేట, బ్రహ్మంగారిమఠం, కలస పాడు, పోరుమామిళ్ల మండలాలతో పాటు కర్నూలు జిల్లాలోని ఆళ్లగడ్డ, చాగలమర్రి, ప్రకాశం జిల్లాలోని గిద్ద లూరు ప్రాంతాల్లో ఈ రకం పంటను సాగు చేస్తారు. శాశ్వత కొనుగోలు కేంద్రం లేకపోవడంతో రైతుల్లో సాగుపై ఆసక్తి తగ్గిపోతోంది.

అమ్మకం కష్టంగా మారుతోంది



కెపి ఉల్లి పంటను నూర్పిడిచేసిన తరువాత అమ్మకాలు చెపడదామంటే కొనుగోలుదారులు ముందుకు రావడం లేదు. ఉల్లి పంట ఎన్నో ఏళ్లుగా సాగు చేపడుతూ ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. ప్రభుత్వం ఎగుమతులపై నిషేధం విధించిన సందర్భంలో అమ్మకం కోసం ఎదురు చూడాల్సిన పరిస్థితి ఏర్పడుతున్నది. ప్రభుత్వం మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేయాలి. **- రామసుబ్బారెడ్డి రైతు, దువ్వూరు.**

శాశ్వత కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలి



కెపి ఉల్లి మన ప్రాంతంలో మాత్రమే సాగు అయ్యే ప్రత్యేక రకానికి చెందినది. సాగుకు అధిక ఖర్చులు అవుతున్నాయి. అమ్మకం సమయంలో చాలా అవస్థలు పడాల్సిన అవసరం ఏర్పడుతున్నది. ప్రభుత్వం శాశ్వత కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేస్తే సాగుకు ఆసక్తి ఉంటుంది. కేంద్ర ప్రభుత్వం ఉల్లి ధరలు పెరిగిన సమయంలో ఎగుమతికిపై నిషేధం విధిస్తుండడంతో ఆ ప్రభావం ఉల్లిపై పడుతున్నది.

- బి.పెద్ద పుల్లారెడ్డి, చల్లబసాయపల్లె, దువ్వూరు.

అమ్మకం కష్టంగా మారింది



కెపి ఉల్లి ఎగుమతులపై ప్రభుత్వం నిషేధం విధిస్తుండటం, స్థానికంగా కొనుగోలు కేంద్రం లేకపోవడంతో అమ్మకం చాలా కష్టంగా మారుతున్నది. ఎన్నో ఏళ్ల నుండి ఉల్లి సాగు చేస్తున్నాం. గత ఏడాది అమ్మకం కోసం ఎదురు చూడాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్రభుత్వం మార్క్‌ఫెడ్ ద్వారా ఉల్లి కొనుగోలు చేయాలి. ఉల్లి కొనుగోలుకు శాశ్వత కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలి.

- కె మద్దిలేటి, చింతలెరువు, చాగలమర్రి, నంద్యాల జిల్లా.

బిజెపి ఓటమితోనే దేశానికి రక్ష

సిపిఎం-సిపిఐ రాజకీయ ప్రచార భేరిలో నాయకులు



మదనపల్లె : నిరసన తెలుపుతున్న నాయకులు

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ఓటమితోనే దేశానికి రక్షణ అని సిపిఎం, సిపిఐ నాయకులు అన్నారు. బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా కార్మిక శ్రామిక వ్యతిరేక, అప్రజాస్వామిక విధానాలకు వ్యతిరేకంగా సిపిఎం, సిపిఐ ఆధ్వర్యంలో చేపట్టిని రాజకీయ ప్రచార భేరి శనివారం రెండో రోజూ సాగింది. పట్టణంలోని హరిశ్చంద్రనగర్‌లో పర్యటించి కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలకు వివరిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ అదానికి దేశాన్ని తాకట్టు పెడుతున్న బిజెపిని తరిమికొట్టాలన్నారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి మహేష్, సిపిఎం నియోజకవర్గ కార్యదర్శి చిట్వేలి రవికుమార్, సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి శివరామకృష్ణదేవరా, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నరసింహ, జిల్లా ఉపాధ్యక్షులు రమణ, నాయకులు నరసింహులు, అహ్మద్ పాల్గొన్నారు. **కలకడ:** దేశంలో ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడిందని, ప్రతీ పౌరుడు గొంతెత్తి కేంద్ర ప్రభుత్వ దుర్మార్గాలను నిలదీయాలని, ప్రజావ్యతిరేక నిరంకుశ మతోన్మాద బిజెపిని ఇంటికి సాగనంపి, దేశాన్ని కాపాడుకుందామని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు సాంబశివ, ఎఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి జక్కల వెంకటేష్ పిలుపునిచ్చారు. ఇంటింటికి వెళ్లి కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆటో వర్కర్స్ యూనియన్ జిల్లా నాయకులు జలాలుద్దీన్, అబీబ్, అషన్ షా, శావత్, రియాజ్, వెంకటరమణ నరసింహులు పాల్గొన్నారు. **మదనపల్లె అర్బన్ :** పట్టణంలోని పలు కాలనీల్లో కేంద్ర ప్రభుత్వ వ్యతిరేక విధానాలపై ముద్రించిన కరపత్రాలను ప్రజలకు పంపిణీ చేశారు. ప్రజలపై వేస్తున్న భారాలను వివరించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రత్యేక హోదా, కడప ఉక్కు, రాజధాని, పోలవరానికి నిధులు రాబట్టుకోలేని దౌర్భగ్య స్థితికి రాష్ట్ర ప్రభుత్వం చేరిందని తెలిపారు. ప్రభుత్వం దేశంలో నిరంకుషత్వంగా పరిపాలన సాగి స్తోందని, ఆహారంపై నిషేధం పెడు తోందని, దేశంలో ఫెడరల్ వ్యవస్థను ప్రక్కన పెట్టి ఒకే బాష, ఒకే సంస్కృతి ఒకే ఆహారం అనే విధానాలు పెడుతుందన్నారు.కార్యక్రమంలో సిపిఎం, సిపిఐ నాయకులు టి.హరీంద్రనాథ్ శర్మ, మురళీ, ప్రభాకర్‌రెడ్డి, పవన్ కుమార్, వెంకటేష్, సహదేవ, సూరి, తిరుమల, శోభ, ఓబులేసు పాల్గొన్నారు.



కలకడ : ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు

నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పనే లక్ష్యం

మెగా జాబ్‌మేళా ప్రారంభంలో కలెక్టర్, ఎంపీ



జాబ్‌మేళాను ప్రారంభిస్తున్న కలెక్టర్ గిరీష, ఎంపీ మిథున్‌రెడ్డి

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

యువత అన్ని రంగాలలో రాణించాలని, నిరుద్యోగ యువతీ యువకులకు ఉపాధి కల్పించడమే లక్ష్యంగా మెగా జాబ్ మేళా నిర్వహించామని కలెక్టర్ గిరీశ, ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి అన్నారు. శనివారం అన్నమాచార్య ఇంజినీరింగ్ కళాశాలలో మెగా జాబ్‌మేళాను ప్రారంభించారు. ఈ సంద ర్భంగా వారు మాట్లాడుతూ నిరుద్యోగులు మెగా జాబ్‌మేళాలో వచ్చిన ఉద్యోగ అవకా శాలను సద్వినియోగం చేసుకోవాలి పేర్కొన్నారు. ఉద్యోగాలు ఇవ్వ డంలో రాష్ట్రంలో అన్నమయ్య జిల్లా ముందం జలో ఉందని తెలిపారు. నిరుద్యోగులు చిన్న ఉద్యోగమైనా నిరాశ పడకుండా ఉద్యోగంలో చేరి అంచలంచెలుగా ఎదగాలని పేర్కొన్నారు. యువతకు మెరుగైన జీవితం కల్పించాలనే ఉద్దే శ్యంతో సిఎం జగన్ మోహన్‌రెడ్డి పని చేస్తున్నారని, జాబ్‌మేళా అనేది నిరంతర ప్రక్రియ అని, చదువుకున్న ప్రతి వ్యక్తి నిరుద్యోగిగా మిగుల కూడదు అనేది లక్ష్యమన్నారు. జాబ్‌మేళాలో 8 వేల మంది రిజిస్ట్రేషన్ చేసుకున్నారన్నారు. 100 కంపెనీలు ఇక్కడకు వచ్చాయని తెలిపారు. జిల్లాలోని విద్యార్థులందరూ ఇందులో భాగస్వామ్యులు కావాలని, అందరూ ఉద్యోగాలు పొందాలన్నారు. ఒక వ్యక్తి ఉద్యోగం పొందాలంటే ఎక్కడికో వెళ్లి అక్కడ గదికి అద్దె కడుతూ ఇబ్బందులు ఎదుర్కోవాలని, ఇలాంటి జాబ్ మేళాలలో అటువంటి ఇబ్బందులు లేకుండా ఉద్యోగం పొందవచ్చన్నారు. అన్నమయ్య జిల్లా ఏర్పాటైన తర్వాత 3 జాబ్ మేళాలు జరిగాయని, దాదాపు 6 వేల మందికి అపాయింట్మెంట్ ఇవ్వడం జరిగిందన్నారు. ప్రభుత్వంలోనే చాల ఉద్యోగాలు ఉన్నాయని, వాటిని కూడా యువత సరైన నైపుణ్యాలతో పొందవచ్చన్నారు. కార్యక్రమంలో జడ్పీ చైర్మన్ ఆకేపాటి అమర్నాథరెడ్డి, రాజంపేట, రైల్వేకోడూరు ఎమ్మెల్యేలు మేడా మల్లికార్జున్‌రెడ్డి, కొరముట్ల శ్రీనివాసులు, ఎస్‌పి గంగాధర్‌రావు, రాజంపేట సబ్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, అన్నమాచార్య కళాశాల గౌరవ కార్యదర్శి డాక్టర్ చొప్పా గంగిరెడ్డి, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సలహాదారులు (ఎన్ఆర్ఐ) రత్నాకర్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్య అభివృద్ధి సంస్థ జిల్లా అధికారి హరికృష్ణ, మున్సిపల్ చైర్మన్ పోలా శ్రీనివాసులురెడ్డి, కమిషనర్ జనార్దన్‌రెడ్డి, కళాశాల వైస్ చైర్మన్ చొప్పా ఎల్లారెడ్డి, ప్రిన్సిపాల్స్ డాక్టర్ ఎస్ఎంవి నారాయణ, రాజంపేట, రైల్వేకోడూరుతో పాటు పొరుగు మండలాల నుంచి ఈ మెగా జాబ్‌మేళాకు పెద్ద సంఖ్యలో యువతీ, యువకులు పాల్గొన్నారు.



సమస్యలు అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే చింతల

సుస్థిర పాలన జగన్‌తోనే సాధ్యం : 'చింతల'

ప్రజాశక్తి-వాల్మీకిపురం

రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం అందించే సుస్థిర పాలన సిఎం జగన్‌తోనే సాధ్యమని పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. శనివారం మండలంలోని చింతపర్తి ఆర్ఎస్ రోడ్డు, మదనపల్లి రోడ్డులో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి సమస్యలను అడిగి తెలుసుకొని, ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలను, వాటితో కలిగిన ప్రయోజనాన్ని వివరించారు. అనంతరం ఎమ్మెల్యే చింతల మాట్లాడుతూ పేదల అభ్యున్నతే ప్రభుత్వ లక్ష్యమన్నారు. సచివలయ వ్యవస్థతో చరిత్ర సృష్టించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డికే దక్కిందన్నారు. అన్ని వర్గాలకు సంక్షేమ పథకాలు అమలు చేస్తూ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో తీసుకెళ్తున్నారన్నారు. సుపరిపాలన, సంక్షేమ పథకాల అమలును చూసి ఓర్వలేక ప్రతిపక్షాలు తప్పుడు ప్రచారాలు చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఒ షబ్బీర్ అహ్మద్, తహశీల్దార్ ఫిరోజ్ ఖాన్, ఇఒ పాండు, నాయకులు, వివిధశాఖల అధికారులు, సచివాలయ ఉద్యోగులు, వాలంటీర్లు పాల్గొన్నారు. పట్టణంలోని జెట్టిపాళ్యంవీధిలో ఉపసర్పంచ్ కేశవరెడ్డి ఆధ్వర్యంలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు పంపిణి చేసి, స్టిక్కర్లను అతికించారు. కార్యక్రమంలో ఎంపిటిసి రాజేష్, సచివాలయ కన్వీనర్ రాయుడు, నాయకులు ముబారక్, అషర్ పాల్గొన్నారు.

వైసిపి ప్రభుత్వంపై ప్రజా వ్యతిరేకత

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

పవనన్న ప్రజాబాట 84వ రోజు రాజంపేటలో కొనసాగుతోంది. జనసేన రాష్ట్ర చేనేత వికాస కార్యదర్శి రాటాల రామయ్య ఆధ్వర్యంలో శనివారం ప్రజాబాట కార్యక్రమంలో భాగంగా మందపల్లి పంచాయితీ, పులుపుత్తూరు పంచాయతీలోని పలు గ్రామాలలో పర్యటించారు. ఈ సందర్భంగా జనసేన నాయకులు మాట్లాడుతూ రాజంపేట అసెంబ్లీ ఇన్‌ఛార్జి మలిశెట్టి వెంకటరమణ ఆదేశాల మేరకు పవన్ అన్న ప్రజాబాట ముందుకు తీసుకువెళ్లడం జరిగిందని తెలిపారు. కార్యక్రమంలో మెజార్టీ ప్రజలు వైసిపి ప్రభుత్వంపై ఆందోళన వ్యక్తం చేశారని అన్నారు. డ్యాం తెగిపోయినా నేటివరకు ప్రభుత్వం ద్వారా ఏ ఒక్క రూపాయి కూడా తమకు దక్కలేదని ఆ గ్రామ ప్రజలు ఆవేదం వ్యక్తం చేశారని పేర్కొన్నారు. రాబోవు 2024 ఎన్నికలలో ఓట్ల రూపంలో ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలన్నారు. కార్యక్రమంలో జనసేన నాయకులు పోలిశెట్టి శ్రీనివాసులు, కొత్తూరు వీరయ్య చారి, హేమంత్, జనసేన వీర మహిళలు జెడ్డా శిరీష, మాధవి పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు రూ.5 లక్షల సాయం

గాయపడిన వారికి రూ.2 లక్షలు

కానుగమాకులపల్లె ఘటన కలచివేసింది

- ఎంపీ మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే ద్వారకనాథ్‌రెడ్డి



మృతుల కుటుంబాలకు రూ.5 లక్షల చెక్కు ఇస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే

ప్రజాశక్తి - బి.కొత్తకోట

పెద్దతిప్పసముద్రం మండలంలోని కానుగమాకులపల్లిలో జరిగిన విద్యుత్ ప్రమాద ఘటనపై రాజంపేట ఎంపీ వెంకట మిథున్‌రెడ్డి, పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. శనివారం బి.కొత్తకోట మండలంలోని వడిగలవారిపల్లికి చెందిన లక్ష్మణ్, శాంతి కుమారి, లక్ష్మమ్మ, విజయ్ ప్రశాంత్ కుటుంబాలను పరామర్శించి మృతదేహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గృహప్రవేశం వేళ ఇలాంటి ఘటన చోటుచేసుకోవడం దురదృష్టకరమన్నారు. మృతుల కుటుంబాలకి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. తక్షణ సాయం కింద మృతి చెందిన ఒక్కొక్కరికి రూ.ఐదు లక్షలు చెక్కును అందజేశారు. గాయపడిన సునీత (40), సుధాకర్ (48), సుబ్బమ్మ (50)లకు తక్షణ సహాయంగా ఒక్కొక్కరికి రూ.2 లక్షలు అందజేశామన్నారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నామన్నారు. కార్యక్రమంలో పలమనేరు నియోజకవర్గం పరిశీలకులు పాగొండ ఖలీల్ అహ్మద్, కొండా సిద్ధార్థ, ఎస్ఎస్ ఫయాజ్, తిరుమల, సంతోష్, వైసిపి జిల్లా ప్రచార కార్యదర్శి అయూబ్ బాషా, జెఎసి మండల సచివాలయ కన్వీనర్‌రెడ్డి హరి పాల్గొన్నారు.

ఘటన దురదృష్టకరం : టిడిపి

కానుగమాకులపల్లె జరిగిన విద్యుత్ ప్రమాదంలో నలుగురు మృతి చెందడం దురదృష్టకరమని టిడిపి రాష్ట్ర కార్యనిర్వహణ కార్యదర్శి ఎస్.ఎం.పర్వీన్ తాజ్, ఆమె భర్త నూర్‌అహ్మద్ పేర్కొన్నారు. మృతదేహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

వైవీయూలో నృత్య, సంగీత కోర్సుల్లో ప్రవేశాలు

కడప అర్బన్: కూచిపూడి నృత్యం, కర్నాటక సంగీతం, కీబోర్డ్ సర్టిఫికెట్ కోర్సుల్లో ప్రవేశం కోసం దరఖాస్తులు ఆసహ్వానిస్తున్నట్లు వైవీయూ ప్రవేశాల సంచాలకులు ఆచార్య కంకణాల గంగయ్య ఒక ప్రకటనలో తెలిపారు. కోర్సులకు సంబంధించిన అర్హతలు, దరఖాస్తు చేయు విధానం దరఖాస్తుకు సంబంధించిన పూర్తి వివరాలకు www.yogivemanauniversity.ac.inలో సంప్రదించాలని పేర్కొన్నారు.


పోలీస్‌స్టేషన్లలో ఎస్‌పి తనిఖీలు



రాజంపేట : సిబ్బందితో మాట్లాడుతున్న ఎస్‌పి గంగాధర్‌రావు

ప్రజాశక్తి-నందలూరు

నందలూరు పోలీస్‌స్టేషన్‌ను శనివారం ఎస్‌పి రెడ్డిగంగాధర రావు ఆకస్మికంగా తనిఖీ చేసి స్టేషన్‌లోని రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్‌పి గంగాధర్‌రావు మాట్లాడుతూ స్టేషన్ రికార్డులను ఎప్పటికప్పుడు సవరించుకోవాలని సూచించారు. స్టేషన్‌కు వచ్చే కేసులను ఇన్‌ఛార్జి ఎస్ఐ దృష్టికి తీసుకువెళ్లాలని స్టేషన్‌కు వచ్చే బాధితులకు న్యాయం చేయాలని అన్నారు. పోలీస్ సిబ్బందికి ఏమైనా సమస్యలు ఉన్నాయా అని అడిగారు. కార్యక్రమంలో డిఎస్‌పి శివ భాస్కర్‌రెడ్డి, రూరల్ సిఐ పుల్లయ్య, ఎస్ఐ భక్తవత్సలం, పోలీసు సిబ్బంది విజయ్ కుమార్, దర్బార్ బాషా, రామకృష్ణ, మేరి పాల్గొన్నారు. **రాజంపేట అర్బన్:** రాజంపేటలోని అర్బన్ పోలీస్ స్టేషన్ రూరల్ పోలీస్ స్టేషన్ డిఎస్‌పి కార్యాలయాలను ఎస్‌పి రెడ్డిగంగాధరరావు తనిఖీ ఆకస్మికంగా చేశారు. ఈ సందర్భంగా ఆయన పోలీసు అధికారులతో మాట్లాడుతూ స్టేషన్ రికార్డులను ఎప్పటికప్పుడు నవీకరించుకోవాలని సూచించారు. స్టేషన్‌కు వచ్చే బాధితులకు న్యాయం చేయాలని, స్టేషన్ పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్‌పి వెంట డిఎస్‌పి శివభాస్కర్ రెడ్డి, అర్బన్ సిఐ నరసింహారావు, రూరల్ సిఐ పుల్లయ్య, అర్బన్ ఎస్ఐ లక్ష్మీ ప్రసాద్ రెడ్డి, వెంకటేశ్వర్లు, రూరల్ ఎస్ఐ భక్తవత్సలం, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు. **పుల్లంపేట :** మండల పరిధిలోని స్థానిక పోలీస స్టేషన్‌ను ఎస్‌పి గంగాధర్‌రావు ఆకస్మిక తనిఖీ చేశారు. పెండింగ్ కేసులను సత్వరమే పరిష్క రించాలని ఆదేశించారు. కార్యక్రమంలో డిఎస్‌పి శివ భాస్కర్ రెడ్డి, సిఐ పుల్లయ్య, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న రైతులు

దారి ఇచ్చిన తర్వాతే జాతీయ రహదారి విస్తరణ

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

రైతుల పంట పొలాలకు రాకపోకలు సాగించేందుకు వీలుగా దారి ఇచ్చిన తర్వాతే జాతీయ రహదారి విస్తరణ పనులు చేపట్టాలని రైతులు రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. శనివారం మదనపల్లి రూరల్ మండలం కొత్తవారిపల్లె గ్రామ పంచాయతీలో జరుగుతున్న నూతన జాతీయ రహదారి నిర్మాణ పనులపై స్థానిక రైతులతో కలిసి సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు తోపు కృష్ణప్ప, ఎపి రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వంగమాల రంగారెడ్డి, సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి కె.మురళి. రైతులు పాల్గొని అధికారులు వెంటనే స్పందించి సమస్యను పరిష్కారం చేయాలని డిమాండ్ చేశారు. మండలంలోని కొత్తవారిపల్లి పంచాయతీ, పోతుబోలు పంచాయతీ సిటిఎం పెద్దచెరువు ఆయకట్టు రైతులు వెయ్యి ఎకరాల ఆయకట్టుకు సంబంధించిన రైతులు పొలాల నుండి పంటను ఓడుపుకొని ఇంటికి తీసుకురావడానికి, సాగు చేయడానికి అండర్ బ్రిడ్జి ఏర్పాటు చేయాలని కోరారు.

నిమ్మ రైతులకు అవగాహన

జమ్మలమడుగు రూరల్ :గూడెంచెరువు, పి.బొమ్మేపల్లి, గండికోట గ్రామాల్లో నిమ్మ రైతు లకు పాటించవలసిన యాజమాన్య పద్ధతులు, తెగుళ్ల చీడపీడలపై ఉద్యాన అధికారి జయభరతరెడ్డి అవగాహన కల్పించారు. ఆ మేరకు ఆయన శనివారం నిమ్మ తోటలను పరిశీలిం చారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడుతూ ప్రస్తుతం అధిక ఉష్ణో గ్రతల నేప థ్యంలో క్రమం తప్పకుండా నీటి తడులు మొదలకు నీళ్ల తగలకుండా ఇవ్వాలన్నారు. బోరాన్ 2 గ్రాములు లీటర్ నీటికి ఇస్తే కాయ పగులును నివారించవచ్చునని తెలిపారు. కాయలకు అధిక ఎండ దెబ్బ తగలకుండా యూరియా ద్రావణం 10 గ్రాములు లీటర్ నీటికి పిచికారీ చేయాలన్నారు. ఆర్‌బికె సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.



పెండింగ్ వేతనాలు చెల్లించాలని నిరసన చేస్తున్న కార్మికులు

పెండింగ్ వేతనాలు చెల్లించాలి

ప్రజాశక్తి-సుండుపల్లి

గ్రామ పంచాయతీ కార్మికులకు పెండింగ్ వేతనాలు చెల్లించాలని గ్రామ పంచాయతీ కార్మికుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు డి.వెంకట్రామయ్య, గౌరవ అధ్యక్షుడు ఎ.రామాంజులు పేర్కొన్నారు. గ్రామ పంచాయతీ కార్మికులకు ఏడు నెలలు, స్వచ్ఛ భారత కార్మికులకు పెండింగ్‌లో ఉన్న 15 నెలల జీతం ఇవ్వక పోవడం సిగ్గుమాలిన చర్య అన్నారు. శనివారం పెండింగ్ వేతనాల చెల్లించాలని కార్మికులతో కలిసి నిరసన తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ పంచాయతీకార్మికులకు, స్వచ్ఛ భారత కార్మికులకు ఇచ్చే పదివేల లోపు జీతం కూడా నెలలు సంవత్సరాల తరబడి ఇవ్వకుండా అధికారులు, పాలకులు వేధించడం సరైందికాదన్నారు. ఇప్పటికైన పెండింగ్ జీతాలు చెల్లించాలని లేని పక్షాన పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీకార్మికులు, స్వచ్ఛ భారత కార్మికులు ఓబులేసు, శరమంద, ఆనంద్, నాగేంద్ర, గంగయ్య, క్రిష్ణయ్య చిన్నరవి, రమణ, చిన్నప్ప, ఓబులమ్మ, సరోజ నిర్మల అనసూయమ్మ యల్లయ్య పాల్గొన్నారు.

ప్రమాద ఘటన దురదృష్టకరం

ప్రజాశక్తి-ములకలచెరువు

పిటిఎం మండలంలోని సంపతికోట పంచాయతీ, కానుగ మాకులపల్లిలో శుక్రవారం జరిగిన దురదృష్టక సంఘటన జిల్లా వ్యాప్తంగా అందరిని కలచివేసింది. శనివారం విద్యుత్ శాఖ తిరుపతి సర్కిల్ ఎస్‌పి (ఆపరేషన్) కృష్ణారెడ్డి, చీఫ్ జనరల్ మేనేజర్ చలపతిలు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ షామియానాకు తాళ్ళు అమర్చి ఉంటే ఇంతటి ప్రమాదకర సంఘటన జరిగి ఉండేది కాదని పేర్కొన్నారు. ఒక్కసారిగా గాలి వీచడంతో షామియానా, ఇనుపకడ్డీ, విద్యుత్ తీగలపై పడడంతో ఒక్కసారిగా షామియానాకు విద్యుత్ సరఫరా కావడంతో విందు చేస్తున్న వారు విద్యుత్ షాక్‌కు గురై నలుగురు మృతి చెందినట్లు తెలిపారు. మరో ముగ్గురు గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారని అన్నారు. మృతుల కుటుంబాలకు విద్యుత్ సంస్థ తరపున ఒక్కొక్కరికి రూ.5లక్షలు, గాయపడిన వారికి రూ.2లక్షలు చొప్పున ఆర్థికసాయం అందిస్తామని తెలిపారు.



గ్యాస్ ప్రమాదంపై డెమో చేసి చూపిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

అగ్ని ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి-లకిరెడ్డిపల్లి

అగ్ని ప్రమాదాలు పట్ల అప్రమత్తంగా ఉండాలని అగ్నిమాపక అధికారి జెసి బాలయ్య పేర్కొన్నారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా శనివారం లక్కిరెడ్డిపల్లి బస్టాండ్ సర్కిల్‌లో అగ్నిమాపక అధికారి జెసి బాలహుస్సేన్ ఆధ్వర్యంలో అక్కడి ప్రజలకు అగ్నిప్రమాదం జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, గ్యాస్ ప్రమాదం జరిగినపుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై గ్యాస్ సిలిండర్ ద్వారా డెమో చేసి చూపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐఎస్ఐ బ్రాండ్ గల గ్యాస్ పైపులను వినియోగించాలని, అవసరం లేనపుడు గ్యాస్ రెగ్యులేటర్ ఆఫ్ చేయాలన్నారు. కార్యక్రమంలో లీడింగ్ ఫైర్‌మెన్ బి.సుదర్శన్ రెడ్డి, ఆర్ రామయ్య, డిఒపి సునీల్ నాయక్, ఫైర్‌మేన్ ఆనంద్, ఆర్.చంద్రశేఖర్, ఎం.సాయిబాబా, ఎం.రాజశేఖర్‌లు పాల్గొన్నారు. **పీలేరు :** అగ్నిమాపక సిబ్బంది ప్రదర్శించిన విన్యాసాలు అందరిని ఆకట్టుకున్నాయి. శనివారం స్థానిక అగ్నిమాపక కేంద్రాధికారి డి.సుబ్బారాజు ఆధ్వర్యంలో అగ్నిమాపక స్మారక వారోత్సవాల్లో భాగంగా సిబ్బంది పట్టణంలో కరపత్రాలు పంచి అగ్ని ప్రమాదాల నివారణపై ప్రజలకు అవగాహన కల్పించారు. స్థానిక ఆర్‌టిసి బస్టాండ్‌లో విన్యాసాలు ప్రదర్శించారు. కార్యక్రమానికి స్థానిక ఆర్‌టిసి డిఎం బండ్ల కుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 1944 ఏప్రిల్ 14న ముంబాయి ఓడరేవులో జరిగిన భారీ అగ్ని ప్రమాద ఘటనలో ప్రాణాలు కోల్పోయిన వారి ఆత్మ శాంతిని కోరుకుంటూ, అగ్నిమాపక శాఖ భారతదేశం మొత్తం ఏప్రిల్ 14 నుండి 20 వరకు అగ్నిమాపక వారోత్సవాలు జరుపుకుంటుందని అన్నారు. ఆ ప్రమాదంలో సుమారు 231 మంది ప్రజలు మృతి చెందారని, మరో 476 మంది క్షతగాత్రులయ్యారని అన్నారు. నాటి అగ్నిప్రమాదంలో అసువులు బాసిన అగ్నిమాపక సిబ్బందికి రెండు నిమిషాలు పాటు మౌనం పాటించి శ్రద్ధాంజలి ఘటించారు. కార్యక్రమంలో అగ్నిమాపక కేంద్రాధికారి డి.సుబ్బారాజు, సిబ్బంది పాల్గొన్నారు.

మజ్జిగ చలివేంద్రం ఏర్పాటు

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్



మజ్జిగ పంపిణీ చేస్తున్న నిర్వాహకులు

ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ప్రకాష్ ఏజెన్సీస్ సౌజన్యంతో శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో శనివారం మజ్జిగ చలివేంద్రాన్ని ప్రారంభించారు. మండుతున్న ఎండలను దృష్టిలో ఉంచుకొని చలివేంద్రం ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం, రాఘవేంద్ర వైశ్య యూత్ అసోసియేషన్ సంఘం, ఆర్యవైశ్య యువజన సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

'సమాజ సేవలో భాగస్వామ్యం కావాలి'

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

విద్యార్థులు చదువుతోపాటు సమాజ సేవలో కూడా భాగస్వామ్యం కావాలని శ్రీ వైష్ణవి డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ పోలా రమణారెడ్డి, ఊటుకూరు ఎంపిటిసి నాగ చంద్రశేఖర్ రెడ్డి విద్యార్థులకు సూచించారు. పోలా రమణారెడ్డి దత్తత గ్రామమైన ఊటుకూరు పంచాయతీ పరిధిలోని కొండ్లోపల్లెలో వారం రోజులు పాటు నిర్వహించే ప్రత్యేక క్యాంపును పోలా రమణారెడ్డి, ప్రిన్సిపల్ ఈశ్వరయ్య నాయుడు ప్రారంభించారు. శనివారం కొండ్లోపల్లె లో ర్యాలీ నిర్వహించి ఎంపియుపి పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైష్ణవి డిగ్రీ కళాశాల విద్యార్థులు సేవా కార్యక్రమాలలో పాల్గొనడం అభినందనీయమని అన్నారు. వైష్ణవి కళాశాల ఎన్ఎస్ఎస్‌పిఒ నాగరాజు మాట్లాడుతూ ఎన్ఎస్ఎస్ వాలంటీర్లచే గ్రామంలో వారం రోజులు పాటు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని చెప్పారు. కార్యక్రమంలో పాఠశాల కమిటీ చైర్మన్ చౌడవరం నరసింహ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



ర్యాలీని ప్రారంభిస్తున్న పోలా రమణారెడ్డి

గంగమ్మ జాతర జరిగేనా..?

వేడుక కోసం ఎదురుచూస్తున్న భక్తులు...నిర్వాహకుల మధ్య వీడని వివాదం

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

సుమారు 200 సంవత్సరాలకు పైగా చరిత్ర కలిగి జిల్లాలోనే ప్రసిద్ధిగాంచిన బలిజపల్లె గంగమ్మ జాతర ఈ ఏడాది జరుగుతుందా లేదా అని భక్తులలో ఉత్కంఠ నెలకొంది. సుదీర్ఘ చరిత్రలో జాతర తేదీ ఖరారు చేసి పోతును పట్టిన తర్వాత జాతర నిలిచిపోయిన సందర్భం లేదు.



స్వయంభుగా వెలసిన బలిజపల్లె గంగమ్మ విగ్రహం

మొక్కుబడులు చెల్లించేందుకు ఎదురుచూస్తున్న భక్తులు : లక్ష మందికి పైగా భక్తులు జాతర కోసం ఎదురుచూస్తున్నారు. కోరిన కోర్కెలు తీర్చే అమ్మగా స్వయంభుగా వెలసిన జిల్లా లోనే ప్రసిద్ధిగాంచిన బలిజిపల్లె గంగమ్మకు మొక్కులు తీర్చుకునేందుకు వేలాది మంది భక్తులు ఎదురుచూస్తున్నారు. ఏప్రిల్ మాసం కూడా గడిచిపోతుండడంతో నేటికీ పోతును పట్టి జాతర తేదీ ఖరారు చేయకపోవడంతో ఈ ఏడాది జాతర లేనట్లేనా అని ప్రజలు చర్చించుకుంటున్నారు. మరికొందరు జాతర పట్ల విశ్వాసం కోల్పోయి గురు, ఆదివారాలలో చాందిని బండ్లు కట్టి అమ్మవారి దగ్గర మొక్కులు తీర్చుకుంటున్నారు.

నిర్వాహకుల మధ్య వీడని వివాదం : బోనం కూడు, పసుపు-కుంకుమ, కుంభం కూడు వంటి మూడు ప్రధాన సంఘాలతో కూడి జాతర నిర్వహించబడుతుంది. గత ఏడాది సాంగ్యాల విషయంలో కొంతమంది నిర్వాహకుల మధ్య తలెత్తిన వివాదం కారణంగా జాతర నిలిచిపోయింది. ఎమ్మెల్యే చొరవతో అధికారులు జాతరను నిర్వహించారు.

భద్రత లేని పోతులరాజు ఆలయం : జాతర సమయంలో మాత్రమే తెరిచే పోతుల రాజు ఆలయాన్ని వివాదాల నేపథ్యంలో ఎరుక లేకుండా కొందరు వ్యక్తులు తాళాలు తీసి తెరచి ఉంచడంతో గురు, ఆదివారాలలో అమ్మవారిని సందర్శించడానికి వచ్చే భక్తులు హుండీ లేకపోవడం వలన మొక్కుబడుల నిమిత్తం పోతుల రాజు ఆలయంలో ఏదో ఒక మూల ధన రూపేనా కానుకలు వేసి వెళుతున్నారు. ఆలయానికి భద్రత లేకపోవడం చేత భక్తులు సమర్పించుకున్న ధన రూప కానుకలు గుర్తు తెలియని వ్యక్తులు అపహరిస్తున్నారు.హుండీ ఏర్పాటు చేస్తే వచ్చే ఆదాయం గుడి అభివృద్ధికి దోహద పడుతుందని చెబుతున్నారు.

ఎమ్మెల్యే చొరవ చూపాలి : అధికారులు, స్థానిక ఎమ్మెల్యే చొరవ తీసుకొని గత ఏడాది లాగే వివాదాలను పరిష్కరించి జాతర జరిగేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుకుంటున్నారు. 200 సంవత్సరాల చరిత్రలో జాతర జరపకుండా నిలిపిన దాఖలాలు లేవన్నారు. జాతర ఈ ఏడాది సజావుగా జరిగేలా చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే మేడా మల్లిఖార్జున రెడ్డిని, అధికారులను ప్రజలు కోరుతున్నారు.

భూసార పరీక్షపై రైతులకు అవగాహన

ప్రజాశక్తి-బి.కొత్తకోట

ఎపి వ్యవసాయ శాఖ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూసార పరీక్షలపై మండల వ్యవసాయ అధికారి కార్యాలయంలో శనివారం శిక్షణాకార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మదనపల్లి వ్యవసాయ సహాయ సంచాలకులు కె.శివశంకర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎడిఎ మాట్లాడుతూ భూసార పరీక్షల ప్రాముఖ్యత, భూమి నందు ఖనిజ లవణాల లభ్యత, లోటు పాట్లు ఏవిధంగా తెలుసుకోవచ్చునో వివరించారు. రైతులు అనవసర ఖర్చులను ఈ భూసార పరీక్షల ద్వారా తగ్గించు కోవచ్చుని అన్నారు. వచ్చే సీజన్‌లో ప్రతి రైతు భూమి నుంచి మట్టి నమూనాలను సేకరించి భూసార పరీక్షలను చేపట్టి రైతులకు తగు సూచనలు, సలహాలు అందిస్తామని చెప్పారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి యు.మురళీ మోహన్, క్షేత్రస్థాయి సిబ్బంది పాల్గొన్నారు. **రామాపురం :** మట్టి నమూనా సేకరణపై మండలంలోని 13 పంచాయతీలో ఆర్‌బికె సిబ్బందికి వ్యవసాయ అధికారి నాగమణి ఆధ్వర్యంలో శనివారం ఒకరోజు శిక్షణ నిర్వహించారు. ఈ శిక్షణ కార్యక్రమానికి లక్కిరెడ్డి పల్లి ఎడి జయరాణి, రైతు శిక్షణ కేంద్రం వ్యవసాయ అధికారి సుచరిత పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎడి జయరాణి మాట్లాడుతూ త్వరలో ప్రతి ఆర్‌బికె కేంద్రం నుంచి మట్టి నమూనా సేకరణకై లక్ష్యాలను నిర్దేశిస్తామని చెప్పారు. రైతుల పొలాల్లో మట్టి సేకరించి భూసార పరీక్షల ఫలితాలను తెలపాలన్నారు. పంటసాగులో వ్యవసాయ అధికారులు, ఆర్‌బికె సిబ్బంది సూచనలు, సలహాలు పాటించాలని తెలిపారు. కార్యక్రమంలో ఎఇఒ కవిత, మండలంలోని ఆర్‌బికె సిబ్బంది పాల్గొన్నారు.



రామాపురం : మట్టి నమూనాలపై శిక్షణ ఇస్తున్న వ్యవసాయ అధికారులు

చిన్నమండ్యం : రైతుభరోసా కేంద్రంలో నేల ఆరోగ్యం, భూసార పరీక్షలపై మండల స్థాయి వర్క్ షాప్ జరిగింది. రైతులకు మట్టి సేకరించడంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి యం.మురళీధర్ మాట్లాడుతూ ప్రతి మూడు పంటలకు ఒకసారి మట్టి పరీక్ష చేయించాలని తెలిపారు. రైతులు భూసార పరీక్ష ఫలితాల ఆధారంగా ఎరువులను వినియోగించినట్లయితే పెట్టుబడులు తగ్గి అధిక దిగుబడులు సాధించవచ్చని తెలిపారు. శిక్షణ కార్యక్రమం మాస్టర్ ట్రైనర్ రాచయ్య అద్వర్యంలో జరిగింది.

ప్రతి విద్యార్థికీ జెవికె కిట్లు అందాలి : ఆర్‌జెడి



జగనన్న విద్యా కానుకను భద్రపరిచే గదులను పరిశీలిస్తున్న ఆర్‌జెడి

ప్రజాశక్తి-పుల్లంపేట

జగనన్న విద్యాకానుక కిట్లు ప్రతి విద్యార్థికి అందాలని పాఠశాల జాయింట్ డైరెక్టర్ యం.వెంకట కృష్ణారెడ్డి పేర్కొన్నారు. శనివారం మోడల్ పాఠశాలను ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న విద్యా కానుక నాలుగవ విడతలో భాగంగా డైరెక్టర్ మోడల్ స్కూల్లో విద్యా కానుక కిట్లు భద్రపరిచే గదులను ఆయన పరిశీలించారు. అనంతరం మండల పరిధిలోని సిఆర్‌పిలు, ఆదర్శ పాఠశాల ప్రిన్సిపల్ శ్రీహరి, ఎంఇఒ రంగనాథయ్య ఎపిఎం, కార్యాలయ సిబ్బందితో సమీక్ష సమావేశాలు నిర్వహించారు. ప్రభుత్వం జూన్ నెలలో విద్యార్థులకు ఇచ్చే జగనన్న విద్యా కానుక కిట్లను మండల పరిధిలోని పాఠశాలల వారీగా సరఫరా చేయు విధానం ను సిబ్బందికి తెలిపారు. డైరెక్టర్ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న సంక్షేమ పథకాలలో జగనన్న విద్యా కానుక ముఖ్యమైందని అన్నారు. జగనన్న విద్యా కానుక కిట్ల గురించి ఎటువంటి సహాయ సహకారాలు కావాలన్నా అందుబాటులో ఉంటానని డైరెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి రంగనాథయ్య , ప్రిన్సిపల్ శ్రీహరి, కెజిబివి పాఠశాల ప్రిన్సిపల్ సుచరిత, మండల ఎపిఎం సుబ్బ లక్ష్మమ్మ, పీడీ రామచంద్ర, అసిస్టెంట్ ఇంజనీర్ రామ్మోహన్‌రెడ్డి, సిఆర్‌పిలు ఆనంద్, లీలాకృష్ణయ్య, చిన్న మునెమ్మ, లక్ష్మీదేవి, ఎంఆర్‌పిలు, శివ, కిషోర్ పాల్గొన్నారు. **నందలూరు:** జగనన్న విద్యా కానుకలను సక్రమంగా పంపిణీ చేయాలని ఆర్‌జెడి ఎం.వెంకట కృష్ణారెడ్డి సూచించారు. మండలానికి సంబంధించి స్టాక్ పాయింట్ కేంద్రాన్ని నాగిరెడ్డి పల్లె ప్రాథమిక పాఠశాలలో పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొదటగా ఎంఇఒ, వెలుగు ఎపిఎం, ఇంజనీరు క్వాలిటీని పరిశీలించి ఆమోదించిన తర్వాతే ఆ క్వాలిటీ కిట్లను పంపడం జరుగుతుందన్నారు. జూన్ 12వ తేదీ వరకు జెవికె కిట్లను జాగ్రత్తపరచాలన్నారు. కార్యక్రమంలో ఎంఇఒ గంగిరెడ్డి, ఉపాధ్యాయులు ప్రభాకర్ రెడ్డి, ఎఇ రామ్మోహన్ రెడ్డి, ఎంఐఎస్ రమణ, సిఆర్‌పిలు, ఐఆర్‌పిలు పాల్గొన్నారు.



పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేస్తున్న టిడిపి నాయకులు


టిడిపి నగర అధ్యక్షుని పుట్టినరోజు వేడుకలు

ప్రజాశక్తి - కడప అర్బన్

తెలుగుదేశం పార్టీ నగర అధ్యక్షులు సానపు రెడ్డి శివ కొండారెడ్డి జన్మదిన వేడుకలు శనివారం తెలుగు యువత నగర అధ్యక్షులు మేకల వెంకటేష్ యాదవ్ ఆధ్వర్యంలో జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో కేక్ కటింగ్, పూలమాలలు, శాలువా వేసి పుట్టినరోజు వేడుకలు నిర్వహించారు. తెలుగుదేశం పార్టీ జిల్లా పార్లమెంట్ వైస్ ప్రెసిడెంట్ నక్కల శివరాం, తెలుగు మహిళ నగర అధ్యక్షురాలు మురికి నాటి సునీత, రాయల్ ఒకటవ డివిజన్ ఇంచార్జ్ మురికి నాటి అంజి, నగర మహిళా ప్రధాన కార్యదర్శి వరద పార్వతి యాదవ్, ఆరవ డివిజన్ ఇంచార్జ్ వరద కిరణ్ కుమార్ యాదవ్, 28వ డివిజన్ ఇంచార్జ్ గాజుల పల్లె రాఘవ, రాష్ట్ర బీసీ కార్యదర్శి నబీ కోట శ్రీనివాసులు, 15వ డివిజన్ ఇంచార్జ్ కొండా సుబ్బయ్య, లాయర్ శివ శంకర్ రెడ్డి, దేవుని కడప మురికినాటి శ్రీధర్, రెండవ డివిజన్ ఇంచార్జ్ నాగరాజు, మృత్యుంజయ కుంట రమేష్ బాబు, పబ్బాపురం పగిలి రవి, క్రిస్టియన్ జిల్లా అధ్యక్షులు ప్రేమ్ కుమార్ పాల్గొన్నారు.

ఘనంగా శివానందరెడ్డి జయంతి

ప్రజాశక్తి- కడప అర్బన్



కందుల శివానందరెడ్డి విగ్రహానికి నివాళులర్పిస్తున్న యాజమాన్యం

కందుల గ్రూపు విద్యా సంస్థల మాజీ చైర్మన్, కీ.శే.కందుల శివానందరెడ్డి 74వ జయంతిని కెఎస్ ఆర్ఎం ప్రాంగణం లో కెఎస్ఎన్ఆర్ ఘాట్‌లో కుటుంబ సభ్యులు కాంస్య విగ్రహానికి పూలమాలవేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కళాశాల కరస్పాం డెంట్, సెక్రటరీ, ట్రెజరరీ కందుల రాజేశ్వరమ్మ మాట్లాడుతూ ఈ కళాశాల ఎంతోమంది నిరుపేద విద్యార్థులకు విద్య, ఉపాధి అందించిందని, కళాశాల అభ్యున్నతికి అహర్నిశ కృషి చేశారని పేర్కొన్నారు. ఆయన ఆశయాలను, లక్ష్యాలను మరింత ముందుకు వెళ్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల వైస్ చైర్మన్ కందుల మదన్ మోహన్ రెడ్డి, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ కందుల చంద్ర ఓబుల్ రెడ్డి (నాని),కే ఓ ఆర్ ఎం కళాశాల చైర్మన్ ఎస్.వెంకట శివారెడ్డి, సెక్రెటరీ, ఎస్ లిఖిత రెడ్డి, అడ్మినిస్ట్రేటివ్ మేనేజర్ పి ప్రేమ్ కుమార్ , ప్రిన్సిపాల్ డాక్టర్ వి ఎస్ ఎస్ మూర్తి, కే ఎల్ ఎం మహిళ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ ఎం.వి. రత్నమ్మ, వివిధ శాఖల అధిపతులు, కల్చరల్ ప్రోగ్రాం సమన్వయకర్త వీరశంకర్,అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు అడిగితే కక్ష సాధింపా?

ప్రజాశక్తి-కలికిరి

పెండింగ్ బిల్లులు అడిగితే ఇఇ చంద్రశేఖర్‌రెడ్డి కక్ష సాదింపు చర్యలకు పాల్పడుతున్నారని కాంట్రాక్టర్ వెంకట నారాయణరెడ్డి ఆరోపించారు. నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో పీలేరు ఏరియా డెవలప్మెంట్ అథారిటీ (పడా) స్కీం కింద 2012 వ సంవత్సరం కలికిరి గ్రామ పంచాయతీలో సిమెంట్ రోడ్ల నిర్మాణము పంచాయతీ వారి ఆదేశాలు మేరకు చేపట్టామని అన్నారు. జెఇ డిఇలు కొలతలు వేసి ఎం బుక్స్ తయారు చేసి బిల్లులు కూడా మంజూరు చేశారని తెలిపారు. డిపాజిట్, క్వాలిటీ కంట్రోల్ డబ్బులు 12 సంవత్సరాలు పూర్తయినా వారి వద్దే ఉన్నందున ఆ డబ్బులు ఇప్పించాలని పదే పదే కోరినట్లు తెలిపారు. అధికార పార్టీ అండదండలతో ఇన్‌ఛార్జి ఇఇగా మదనపల్లికి వచ్చి స్థానచలనం లేకుండా సామాన్యమైన నాలాంటి కాంట్రాక్టర్లను ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉన్నతాధికారులు స్పందించి ఇఇ పై చర్యలు తీసుకుని నాకు రావలసిన పెండింగ్ బిల్లులు ఇప్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి ఇన్‌ఛార్జి నిజాముద్దీన్, రాజంపేట పార్లమెంట్ నియోజకవర్గ ఉపాధ్యక్షుడు చంద్రశేఖర్, మాజీ జడ్‌పిటిసి మాలతి, టిడిపి నాయకులు మల్రెడ్డి, మర్రిగుంటపల్లి సర్పంచ్ రెడ్డిరామ్, రాజారెడ్డి, జనార్దన్ గౌడ్, సూర్యప్రకాష్‌రెడ్డి, మోహన్, భాస్కర్‌రెడ్డి, ముస్తఫా హజరత్, సనావుల్లా, వైజాగ్‌బాషా, ప్రతాప్‌రెడ్డి పాల్గొన్నారు.

క్వారీతో సమస్యలుంటే తెలపండి: ఆర్‌డిఒ

ప్రజాశక్తి-ములకలచెరువు

మండలంలోని బురకాయలకోట పంచాయతీ బోయమాలపల్లె సమీపంలో గ్రానైట్ క్వారీ నడిపేందుకు ప్రభుత్వం అనుమతులు జారీ చేసిందని, ఏవైన సమస్యలుంటే తెలియజేయాలని ఆర్‌డిఒ సత్య నారాయణరావు ప్రజలను కోరారు. శనివారం క్వారీ సమీపంలో చుట్టు పక్కల ప్రజలతో ప్రజా అభిప్రాయ సేకరణ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆమర మాట్లాడుతూ సర్వే నంబరు 1561.1562 లో క్వారీ కోసం అనుమతులు మంజూరు అయ్యాయని చెప్పారు. ఈ క్వారీలో సుమారుగా వంద మందికి చుట్టుపక్కల వారినే ఉద్యో గాల్లో నియమిస్తామని చెప్పారు. రోడ్డు మార్గం ఉంటుందని, ప్రజలకు ఎటు వంటి ఇబ్బందులు ఉండవన్నారు. ప్రభుత్వ నియమ, నిబంధనలతో పనులు చేస్తామని తెలిపారు. క్వారీ ఏర్పాటుకు ప్రజలు సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో తహశీల్దార్ శ్రీనివాసులు, రెవెన్యూ సిబ్బంది. వాయుకాలుష్య నియంత్రన అధి కారులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.



కాలనీలో పట్టాలను పరిశీలిస్తున్న తాహశీల్దార్ భాగ్యలత

ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే కఠిన చర్యలు

ప్రజాశక్తి-కలికిరి

ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తాహశీల్దార్ భాగ్యలత హెచ్చరించారు. కలికిరి మేజర్ పంచాయతీ పరిధిలో మదనపల్లి రోడ్డులో పడా కార్యాలయం వెనుక భాగంలో 2008లో ప్రభుత్వం పేదలకు ఇచ్చి ఇళ్ల స్థలాలను ప్రయివేట్ వ్యక్తులు ఆక్రమించుకున్నారని ఫిర్యాదు మేరకు శనివారం తాహశీల్దార్ తనిఖీ చేశారు. స్థానిక సర్వేయర్ వారి సిబ్బందితో పాటు విఆర్ఒ శివ అప్పటి ప్రభుత్వం ఇచ్చిన ఇందిరమ్మ ఇళ్లు, లబ్ది పొందిన వారి నుంచి పట్టా పేపర్లు తీసుకొని పరిశీలించారు. అవి రెవిన్యూ రికార్డుల్లో ఉందా, లేఅవుట్‌లో వారి పేర్లు నమోదు అయ్యాయో క్షుణంగా పరిశీలించి అర్హులైన వారికి మాత్రమే ఇళ్ల స్థలాలు అప్పగిస్తామని చెప్పారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొంతమంది వ్యక్తులు రెవిన్యూ సిబ్బంది సహకారంతో ప్రభుత్వ భూములను ఆక్రమించి, పట్టాలు ఇప్పిస్తామని నమ్మించి డబ్బులు కాజేస్తూ, భూములను అమ్మేస్తున్నారని అన్నారు. అలాంటి వారిని నమ్మి ఎవరైనా ప్రభుత్వ భూములను కొన్నా శిక్షార్హులు అవుతారని, వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.



క్షయ వ్యాధిగ్రస్తులతో మాట్లాడుతున్న పరిశీలకులు జయప్రకాష్

క్షయవ్యాధిని పూర్తిగా నయం చేయవచ్చు

ప్రజాశక్తి-నందలూరు

క్షయ వ్యాధిని పూర్తిగా నయం చేయవచ్చునని మండల ప్రభుత్వ వైద్యాధికారిణి డాక్టర్ సృజన, క్షయవ్యాధి కార్యక్రమ పరిశీలకులు జయప్రకాష్ పేర్కొన్నారు. శనివారం అరవపల్లి ఆరోగ్య కేంద్రంలో ఏర్పాటు చేసిన క్షయవ్యాధిపై అవగాహనా కార్యక్రమం నందు క్షయవ్యాధిని జయించిన టిబి ఛాంపియన్ మాట్లాడుతూ తనకు 6 నెలల క్రితం దగ్గు, ఛాతిలో నొప్పి కారణంగా కడప లోని ప్రయివేట్ వైద్యుడిని సంప్రదించగా ఎక్సరే చేసి తనకు క్షయ సోకినట్లు నిర్ధారించి చికిత్స నిమిత్తం నందలూరు ప్రభుత్వ వైద్య శాల కు పంపించారని అన్నారు. వైద్యులు తనని పరీక్షించి, క్షయ వ్యాధి నిర్ధారించి, క్షయ పూర్తిగా నయం చేయదగిన జబ్బు అని చికిత్స పూర్తిగా ఉచితంగా అందించారాని తెలిపారు. ఆరు నెలలు మందులు వాడుతూ, దాతల సహకారంతో వైద్యులు అందించిన పౌష్టికాహారం తింటూ క్షయపూర్తిగా నయం చేసుకోవచ్చని ఎవరు బయపడవలసిన పని లేదని తెలిపారు. కావున రెండు వారాలు మించి దగ్గు, జ్వరం, ఛాతి నొప్పి, బరువు తగ్గుతున్న వారు దగ్గర లోని ప్రభుత్వ వైద్యశాలలో గళ్ళ పరిక్ష చేయించుకోవాలని క్షయ వ్యాధి ప్రాంతీయ అధికారిని డాక్టర్ సృజన తెలిపారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారి డాక్టర్ చంద్ర శేఖర్ రెడ్డి, ఎంఎల్ హెచ్‌పి సులోచన, లక్ష్మమయ్య, ఆశలు, 104 సిబ్బంది పాల్గొన్నారు. **చింతల కుంటలో..**ఫ్యామిలీ ఫిజిషియన్ ప్రోగ్రామ్‌లో భాగంగా మండలం లోని మారుమూల ప్రాంతమైన, ఎర్రచెరువుపల్లి సచివాలయం పరిధిలోని చింతలకుంట గ్రామంలో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మండల వైద్యాధికారి డాక్టర్ చంద్ర శేఖర్ రెడ్డి మాట్లాడుతూ మారుమూల ప్రాంతాలలో సైతం ఇంటి దగ్గర్లోనే మెరుగైన వైద్యం అందించే గొప్ప కార్యక్రమం ఫ్యామిలీ ఫిజిషియన్ ప్రోగ్రామ్ అని అన్నారు. శిబిరంలో 32 మంది మధుమేహం, రక్తపోటు, గర్భిణులు, బాలింతలకు ఇతర రోగులకు వివిధ జబ్బులకు వైద్యపరీక్షలు, మాత్రలు పంపిణీ, ఆరోగ్య సలహాలు, అవగాహన కార్యక్రమం నిర్వహించిందని తెలిపారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పి రజిని, ఎఎన్ఎం నాగమణి, సుబ్బయ్య, ఆశలు, 104 సిబ్బంది పాల్గొన్నారు.

క్రైం కార్నర్

ఆటోను ఢీ కొన్న లారీ : ఒకరు మృతి

ముగ్గురికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి-బి.కొత్తకోట



మృతి చెందిన వెంకటేష్

ప్యాసింజర్ ఆటోను లారీ ఢీకొన్న ప్రమాదంలో ఒకరు మృతి చెందగా, ముగ్గురు తీవ్రంగా గాయపడిన సంఘటన మండలంలో శనివారం చోటుచేసుకుంది. బి.కొత్త కోట పోలీసులు కథనం మేరకు వివరాలు... పట్టణం బిసి కాలనీకి చెందిన అజయ్ తన ఆటోలో మదనపల్లి నుండి బి.కొత్తకోటకు ముగ్గురు ప్రయాణికులతో బయలు దేరాడు. వీరి ఆటో మండలంలోని కోటావూరు పంచాయతీ, ఈడిగపల్లె సమీపంలోని యర్రంరెడ్డి మామిడితోట వద్దకు రాగానే ఎదురుగా వేగంగా వచ్చిన ఒ లారీ వీరి ఆటోను ఢీకొంది. ఈ ప్రమాదంలో పిటిఎం మండలం బెట్టకొండకు చెందిన వెంకటేష్ అక్కడికక్కడే మృతి చెందాడు. ఆటోలో ప్రయాణిస్తున్న దేగానిపల్లికి చెందిన పృధ్వి, ఎస్‌సి కాలనీకి చెందిన నరేష్, ఆటో డ్రైవర్ అజయ్ లు తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను హుటాహుటిన మదనపల్లి జిల్లా ఆస్పత్రికి తరలించారు. వీరిలో ఆటో డ్రైవర్ అజయ్ పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిపారు. లారీ డ్రైవర్ అతివేగం, నిర్లక్ష్యం కారణంగానే ప్రమాదం జరిగినట్లు పోలీసులు పేర్కొన్నారు. ప్రమాదంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ.రామ్మోహన్ వెల్లడించారు.

యాచకుడి మృతి

నందలూరు : నందలూరు రైల్వే చెయ్యేరు వంతెన సమీపంలో రైల్వే తాగునీటి పంపుహౌస్ ప్రక్కగా వెంకటేష్ (80)అనే యాచకుడు శనివారం మృతి చెందాడు. ఈ సందర్భంగా పంపు హౌస్ సమీపంలోని గొల్లపల్లి గ్రామస్తులు మాట్లాడుతూ మృతి చెందిన వ్యక్తి అన్నమయ్య డ్యాం తెగినప్పుడు వచ్చిన వరదల్లో కొట్టుకుపోతున్న ఓవ్యక్తి ప్రాణాలు కూడా కాపాడాడని తెలిపారు. మృతి చెందిన విషయం రైల్వే పోలీసులకు, నాగిరెడ్డిపల్లె పంచాయతీ అధికారుల దృష్టికి తీసుకెళ్లిన సాయంత్రం వరకు పట్టించుకోక పోవడంతో శవానికి పురుగులు పట్టాయని తెలిపారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి అంతక్రియలు చేపట్టాలని అక్కడి గ్రామస్తులు కోరుతున్నారు.

పూరి గుడిసె దగ్ధం

ప్రజాశక్తి-ములకలచెరువు

అగ్ని ప్రమాదంలో పూరిగుడెస దగ్ధం కావడంతో డ్రిప్పు పరికరాలు, పైపులు కాలిపోయిన సంఘటన శనివారం మండలంలో జరిగింది. బాధితురాలు నాగవేణి కథనం మేరకు వివరాలు... మండలంలోని పెద్దమొరవపల్లెకు చెందిన నాగవేణి పూరిగుడెస ప్రమాద వశాత్తు అగ్గి అంటుకొని మంటలు వ్యాపించాయి. స్థానికులు గమనించి అగ్నిమాపక యంత్రానికి సమాచారం అందించారు. అనంతరం స్థానికులు మంటలను ఆర్పే ప్రయత్నం చేశారు. అగ్నిమాపక యంత్రం వచ్చేలోగే గుడెస పూర్తిగా కాలిపోయింది. అందులోని డ్రిప్పు పరికరాలు. పైపులు కాలిబూడిదయ్యాయి. ఈ ప్రమాదంలో రూ.50 వేలు నష్టం జరిగిందని ప్రభుత్వం ఆదుకోవాలని బాధితులు కోరారు.